# ప్రశ్నలు & సమాధానాలు

## ప్రశ్న 347: మన సహవాసము యొక్క ప్రభావం
**జనవరి 2, 2025**

ఈ ఉద్ధరణ ప్రొ. అనిల్ కుమార్ గారి *Seeking Within,* పేజీలు *76-80* నుండి తీసికొనబడినవి.

ప్రొ. అనిల్ కుమార్ గారు భగవాన్ బాబా వారి సందేశము, ఉపదేశములను ప్రపంచ వ్యాప్తంగా చాటి చెప్పడానికి ఎంపిక చేయబడ్డారు. భారత దేశంలోను, ఇతర దేశాలలోను కూడా విస్తారముగా తిరిగి ఎంతో మంది భక్తులు అడిగిన ప్రశ్నలు, సందేహాలు స్వామి చెప్పిన వాక్కులు, ఉపన్యాసాలను మూలంగా తీసుకొని తేటతెల్లం చేసారు. ముఖ్యంగా ప్రొ. అనిల్ కుమార్ గారు మన సర్వాంతర్యామి సాయిని ఎలా చేరుకోవాలో మార్గం చూపుతారు.

ప్ర: దుష్ట సహవాసం అనగా ఏమి**?**

జ. **ప్రొ. అనిల్ కుమార్:** నాకు వచ్చిన మరో ప్రశ్న ఇది. "సహవాసం అనగా ఏమి? సాధుజన సహవాసం అనగా ఏమి? దుష్టజన సహవాసం అనగా ఏమి? నన్ను నేను మోసం చేసుకుంటున్నానా?" నిజమే, మనం చాలా సార్లు అదే చేస్తాము.

వీరికి వివరణ కావాలి. "సాధుజన సహవాసం అనగా ఏమి? దుష్టజన సహవాసం అనగా ఏమి?" స్పష్టమైన ప్రశ్న. సాయి భక్తులుగా దీనికి జవాబు తెలుసుకుందాం. సాధుజన సహవాసం అనగా ఏమి? సాధుజన సహవాసం అనగా ఆయన దివ్య పాదపద్మములను ఆశ్రయించడానికి తోడ్పడేది. సాధుజన సహవాసం మన విశ్వాసాన్ని పెంపొందించేది. సాధుజన సహవాసం అనగా సేవలో పాల్గొనడానికి ఉత్సాహపరిచేది. సాధుజన సహవాసం అనగా దైవసంకల్పమునకు దగ్గర చేర్చునది. సాధుజన సహవాసం అనగా జీవితములో ఒడిదుడుకులను ఓర్చుకొనే శక్తిని ఇచ్చేది. సాధుజన సహవాసం అనగా ధనము, సంసారములపై మమకారం తగ్గించేది. అదే సాధుజన సహవాసం.

ఏ సహవసమైతే ఇక్కడినుండి పారిపోవునట్లు చేయునో, ఏ సహవాసమైతే మన విశ్వాసమును పోగొట్టునో, ఏ సహవాసమైతే ఎవరి వద్దకైనా, ఎక్కడికైనా, ఏ సమయములోనైనా కారణం లేకుండా తీసుకెళ్ళునో, ఏ సహవాసమైతే భయాందోళనలు కలిగించునో, ఏ సహవాసమైతే నాస్తికులుగా మార్చునో, అదే దుష్టజన సహవాసం.

సాధుజన సహవాసం చేస్తే అది సత్సంగం. భగవాన్ కొన్ని ఉదాహరణలు ఇచ్చారు. ఇసుక గాలితో చేరితే పైకి ఎగురుతుంది. అదే ఇసుక నీటితో కలిస్తే కిందికి పోతుంది. అదే విధంగా సాధుజన సత్సంగంతో మన జీవితంలో పైకి వస్తాము. దుష్టజన సహవాసంతో మన ఆలోచనలు కూడా చెడ్డవిగా మారుతాయి. దుష్టజన సహవాసం గురించి జాగ్రత్తగా ఉండాలి. "Run away from bad company," అని బాబా చెప్పారు.
ప్ర: స్నేహితుల గురించి, మన జీవితంలో వారి పాత్ర గురించి స్వామి ఏమి చెప్పారు**?**

జ. ప్రొ. అనిల్ కుమార్: “Tell me your company and I shall tell you what you are,” అని స్వామి తరచూ చెబుతుంటారు. కానీ స్నేహితులారా, ఈనాడు మనకు స్నేహితులు లేరు, లేరు, లేరు! ప్రొద్దున్న మిత్రుడైన వాడు రాత్రికి శత్రువు అయిపోతాడు. ఈనాడు మన స్నేహాలన్నీ స్వార్థపరమైనవే. ఎక్కువ శాతం స్నేహాలు రాజకీయమైనవి. అవసరం కొద్దీ ఏర్పడే స్నేహాలు. కానీ నిజమైన స్నేహితుడు ఎవరు? స్నేహితుడు అనగా ఏమిటి?

“నీతో ఉన్న వాడు, ఉండే వాడు, ఉండిన వాడు - భూత భవిష్యత్తు వర్తమాన కాలములలో ఎప్పుడూ నీ ప్రక్కన ఉండే వాడే నీ నిజమైన స్నేహితుడు,” అని చెప్పారు భగవాన్.

ఇరుకులో పడినప్పుడు మన స్నేహితులన్న వారు మన మొహం కూడా చూడరు. “జేబులో డబ్బుండి నీ తండ్రి ఉద్యోగంలో ఉన్నప్పుడు హాలో హాలో అంటూ వస్తారు. నీ తండ్రి ఉద్యోగంలోంచి రిటైర్ అయ్యి జేబు ఖాళీ అయాక ఎవరూ గుడ్ బై కూడా చెప్పరు,” అని చెప్పారు బాబా. కనుక ఈనాడు నిజమైన స్నేహితులు లేరు.

భగవాన్ ఒక ఉదాహరణ ఇచ్చారు. ఒక రోజు ఒకతను ఏదో కారణంతో కోర్టులో పడ్డాడు. అతనికి ముగ్గురు స్నేహితులు ఉన్నారు. “సాక్షిగా కోర్టుకి వస్తావా?” అని మొదటి స్నేహితుడిని అడిగాడు. “సారీ, క్లబ్బులో సరదాగా పేకాట ఆడినాము కానీ సాక్షిగా కోర్టుకి రాలేను,” అని జవాబు ఇచ్చాడు.

“ఆహా.”

తర్వాత రెండో స్నేహితుడి దగ్గరకు వెళ్ళి, “ఒరేయ్, మనం చిన్నప్పటి నుండి కలిసి చదువుకున్నాం, స్నేహితులుగా ఉన్నాం. కోర్టుకి సాక్షిగా వస్తే నన్ను నిర్దోషిగా విడుదల చేస్తారు, వస్తావా?” అని అడిగాడు.

“లేదు, లేదు, లేదు, నేను కోర్టుకి రాలేను. ఒక మంచి ప్లీడర్ అడ్రెస్స్ ఇస్తాను. అతను నీ తరపున వాదన చేస్తాడు. కానీ నేను మాత్రం కోర్టుకి రాలేను,” అని చెప్పాడు.

“ఓహో, సరే.”

అప్పుడు మూడవ స్నేహితుడి వద్దకు వెళ్ళి, “నాకు సహాయం చేస్తావా?” అని అడిగాడు.

“తప్పకుండా వస్తాను. నీ తరపున సాక్షిగా నిలబడతాను. వారు నిన్ను విడుదల చేస్తారు.”

ఈ విధంగా మనకు ముగ్గురు మిత్రులు ఉన్నారు. ఎవరు వారు? మొదటి మిత్రుడు మనకు బాగా తెలిసిన స్నేహితులు. వీరు “ఓ, వాడు చనిపోయాడు, ఏమి చేస్తాం?” అనే వారు.

రెండవ రకం మన బంధువులు. మనం చనిపోతే స్మశానానికి వచ్చేవారు.

ఇక మూడవ మిత్రుడు మన పుణ్య కర్మఫలాలు - మనం చనిపోయిన తర్వాత కూడా మనతో వచ్చేవి. మనం చేసిన కర్మఫలాలు మన వెంటే వస్తాయి. కనుక కర్మఫలం అనే స్నేహితుడు సర్వసాక్షి అయిన భగవంతుడు. “ఎవరు నా స్నేహితుడు?” అన్న ప్రశ్నకు జవాబు భగవంతుడు తప్ప మరెవరూ కాదు.

ప్ర: సాధుజన సహవాసం అనగా ఏమి? దుష్టజన సహవాసం అనగా ఏమి? చెడును మంచిగా మార్చగలమా?

జ. ప్రొ. అనిల్ కుమార్: చెడును మంచిగా మార్చగలమా అని అడిగినప్పుడు మనమే మారిపోకుండా జాగ్రత్త పడాలి!

మొట్ట మొదటగా మనము చెడుగా మారిపోకుండా జాగ్రత్త పడాలి.

రెండవది, ఏది మంచి, ఏది చెడు అన్నది అందరికీ తెలిసినదే. ఇది మంచి సహవాసం, అది చెడు సహవాసం అని చెప్పనక్కరలేదు. ఎవరికీ చెప్పవలసిన అవసరం లేదు. అందరికీ తెలుసు! మంచి చెడు బాహ్యంగా లేవు. దీనిని విశదీకరిద్దాం.

భగవాన్ ఏమన్నారంటే... అబ్బా! ఒక్కొక్క సారి భగవాన్ చెప్పిన మాటలు తలచుకుంటే నిజంగా నన్ను నేనే మర్చిపోతుంటాను. ఆ మాటలలోని అంతరార్థం తెలుసుకోవడానికి ప్రయత్నిస్తే మనను మనమే మర్చిపోవచ్చు. ఆయన చెప్పే విషయాలలోని అంతరార్థం, ఆయన భావములోని తీవ్రత, ఆయన చెప్పే విధానం, ఆయన పలుకులు, ఆయన ఉపదేశాలు...

"మంచి చెడు బాహ్యంగా లేవు, అవి నీలోనే ఉన్నాయి. మంచి చెడు నీలోనే ఉన్నాయి. నువ్వు మంచి తలపులు తలిస్తే సాధు సహవాసంలో ఉంటావు. నీలో చెడు తలపులు కలిగితే దుష్ట సహవాసంలో ఉంటావు," అని చెప్పారు భగవాన్.

అది స్పష్టమే కదా? కనుకనే "అన్నీ నీ అంతరంగం యొక్క ప్రతిబింబమే," అని చెప్పారు బాబా.

"నువ్వు చెడ్డవాడివి..." అని చెప్పడానికి నువ్వు చెడ్డవాడివని నాకెలా తెలుసు? నాలో ఉన్న చెడు నీలో ఉన్న చెడును గుర్తించింది కనుక నువ్వు చెడ్డవాడివి అని అంటాను. అంటే ఇద్దరమూ చెడ్డవారలము. అర్థమయ్యిందా?

"నువ్వు మంచివాడివి," అని అంటే నాలో ఉన్న మంచితనం నీలో ఉన్న మంచిని గుర్తించింది. కనుక నువ్వు మంచివాడివి అన్నాను. ఇద్దరమూ మంచివారమే.

మంచి చెడులు నాలో ఉన్నవి కనుక వాటిని బాహ్యంగా గుర్తించి వాటికి పేర్లు పెట్టడం మొదలు పెడతాను. వాటిలో భేదాలు చూస్తాను. వాటిని విడదీస్తాను. ఇవన్నీ నాలోని ప్రతిబింబాలు. కనుక స్నేహితులారా, సాధుజన సహవాసం మన మంచి కొరకే.

స్నేహితులారా, నాలో ఉన్న చెడును నేను అంగీకరించక చెడ్డవారితో నేను కలవను అంటే నన్ను నేను క్షమించుకో లేకపోతున్నాను. నన్ను నేను భరించ లేకపోతున్నాను. నన్ను నేను ప్రేమించ లేకపోతున్నాను. అందుకే "వీడు చెడ్డవాడు, వాడు చెడ్డవాడు," అంటాను.

మొట్టమొదట నన్ను నేను క్షమించుకోవడం నేర్చుకోవాలి. నన్ను నేను గౌరవించుకోవడం నేర్చుకోవాలి. నన్ను నేను ప్రేమించడం నేర్చుకోవాలి. అప్పుడే అందరినీ, మంచైనా చెడ్డైనా, మన్నించగలుగుతాను. అదీ జవాబు.

ప్రొ. అనిల్ కుమార్ వచ్చే వారం మరిన్ని దివ్య ఉపదేశాలు అందిస్తారు. ధన్యవాదములు.

ఓం సాయి రామ్